క్లుప్తంగా

సొసైటీ అధ్యక్షునికి మంత్రి పరామర్శ



భీమనపల్లిలో సత్తిరాజును పరామర్శిస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: అనారోగ్యంతో బాధపడుతూ విశ్రాంతి తీసుకుంటున్న భీమనపల్లి సహకార సంఘం అధ్యక్షుడు శిరంగు సత్తిరాజును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆదివారం పరామర్శించారు. మంత్రి విశ్వరూప్ భీమనపల్లి పంచాయతీ పరిధి సూదాపాలెంలో సత్తిరాజు స్వగృహానికి వెళ్లి ఆయన ఆరోగ్యం గురించి ఆరా తీశారు. మెరుగైన వైద్యం పొంది త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. మంత్రి వెంట సర్పంచ్ పెయ్యిల రాజ్‌కుమార్, వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, తుని నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీను, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ మానే శ్రీను, దుర్గ, శిరంగు రాజా తదితరులున్నారు.

బైక్ ర్యాలీ విజయవంతం చేయాలి

ఉప్పలగుప్తం: ఆగస్టు 2న జరిగే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని అమలాపురం అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ అయితాబత్తుల సుభాషిని పిలుపునిచ్చారు. మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలో ఏఐసీసీ కోఆప్షన్ సభ్యుడు చీకట్ల అబ్బాయి నివాసంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పోలిశెట్టి హరిబాబు, దోనిపాటి విజయలక్ష్మి, చీకట్ల అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క స్వైర విహారం



అమలాపురం గొల్లగూడెంలో ఓ పాదచారిని కరుస్తున్న పిచ్చి కుక్క

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం గొల్లగూడెం సెంటరులో ఓ పిచ్చి కుక్క ఆదివారం సాయంత్రం స్వైర విహారం చేసింది. ఆ ప్రాంతంలో నడిచి వెళుతున్న నలుగురిని కరిచి గాయపరిచిందని స్థానికులు చెబుతున్నారు. ఆ పిచ్చికుక్క ఓ పాదచారిని కరుస్తున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మున్సిపల్ అధికారులు స్పందించి తక్షణమే పిచ్చి కుక్కను అదుపుచేసేందుకు చర్యలు తీసుకోవాలని గొల్లగూడెం సెంటరు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

200 మందికి మధుమేహ పరీక్షలు



సీతారామపురంలో మధుమేహ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న లయన్స్ ప్రతినిధులు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురంలో తాళ్లరేవు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సుమారు 200 మందికి మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. డయాబెటిక్‌ను నిర్మూలించే క్రమంలో స్క్రీనింగ్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు చోడే శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు కట్టా ఆదినారాయణ, బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, ధూళిపూడి వెంకటరమణ(బాబి), హెల్త్ సూపర్ వైజర్ చిన్న తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ ఆరోపణల్లో వాస్తవం లేదు

తాళ్లరేవు: కేశవ స్వామి దేవస్థానంలో ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని, స్వామివారి కైంకర్యాలు తూతూ మంత్రంగా జరుగుతున్నాయని ఆలయ చైర్మన్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని ఆలయ ఈఓ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. ఉద్యోగులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారంటూ ఆలయ చైర్మన్ కొల్లు శ్రీను చేసిన ఆరోపణలపై ఆదివారం ఆయన స్పందించారు. గుర్తొచ్చినపుడు వచ్చి సంతకాలు పెడుతున్నారంటూ తనపై చేసిన ఆరోపణల్లోనూ వాస్తవం లేదన్నారు. కార్యనిర్వహణాధికారిగా తన విధులను చైర్మన్ ప్రశ్నించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం

కాట్రేనికోన: వరద ముంపులో ఉన్న పలంకుర్రు, నడవపల్లి గ్రామాల్లోని గర్భిణులకు మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందజేస్తున్నారు. పల్లంకుర్రు సూపర్‌వైజర్ ఎల్.రమణితో కలసి ఐసీడీఎస్ ముమ్మిడివరం ప్రాజెక్టు ఇన్‌చార్జి సీడీపీఓ తులసి కుమారి నడవపల్లి, పలంకుర్రులలో గర్భిణులకు అందిస్తున్న ఆహారాన్ని ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాతి అలివేణి, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ వెంకటాచలం, శైలజ పాల్గొన్నారు.



ఐ.పోలవరం మండలం కేశనకుర్రులో ఇళ్ల వద్దకు చేరిన వరద నీరు



బోడసకుర్రులో వరద బాధితులకు పడవపై వెళ్లి భోజనాలు అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది



ఎదుర్లంక పునరావాస కేంద్రం వద్ద బాధితులకు ధైర్యం చెబుతున్న తహసీల్దారు ర్యూన్సీ లక్ష్మీకుమారి



ముంపు ప్రాంతాల్లో బాధితులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ముంపులో లంక గ్రామాలు

- అనేక గ్రామాలను చుట్టుముట్టిన నీరు
- ముంపు ప్రాంతాల్లో పడవలపై వెళ్లి ఆహారం అందజేత

ఐ.పోలవరం/అల్లవరం: ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వస్తున్న వరద నీటిని ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో గోదావరిలో ఉధృతి తగ్గడం లేదు. ఐ.పోలవరం మండలంలోని పలు గ్రామాల్లో లంక పొలాలు గత వారం రోజులుగా వరద ముంపులోనే తేలియాడుతున్నాయి. గోదావరిలో నీరు క్రమేపి పెరుగుతుండటంతో తీర ప్రాంత ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. రైతులు లంకల్లో ఉన్న వ్యవసాయ ఉత్పత్తులను మెరక ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ఎటుచూసినా వరదే

ఐ.పోలవరం మండలంలోని పశువుల్లంక, మురమళ్ల, కేశనకుర్రు, కొమరగిరి, ఎదుర్లంక, జి.మూలపొలం, గుత్తినదీవి గ్రామాల్లోని లంక గ్రామాలు, మత్స్యకారుల నివాస ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నాయి. ఎగువ ప్రాంతంలో వరద తగ్గితేనే ముంపు నుంచి బయటపడగలమని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే వరద ఉధృతి వల్ల మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద ఉన్న పుష్కరఘాట్ మెట్ల పైకి వరద నీరు చేరుకుంది. కేశనకుర్రులో పొగాకులంక, పల్లెగూడెం తదితర ప్రాంతాల్లో కూరగాయల తోటలు ముంపుబారిన పడ్డాయి. పశువుల్లంక, ఎదుర్లంక, అన్నంపల్లి అక్విడెక్టు వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతుంది. అల్లవరం మండలం బోడసకుర్రు వద్ద వైనతేయ నది ఉధృతంగా ప్రవహిస్తుంది. మత్స్యకారులకు చెందిన 70 ఇళ్లు వరద ప్రభావానికి గురయ్యాయి. రోజు రోజుకి వరద పెరగడంతో వైనతేయ నది నుంచి వరద నీరు కుమ్మరికాలువలోకి ఎదురెక్కి బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని కంసాలమామిడి, గౌతమనగర్‌లకు చేరింది. కుమ్మరికాలువ పొంగడంతో అల్లవరం, గుడ్డివానిచింత వద్ద పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. బోడసకుర్రులోని వందలాది ఎకరాల్లో నారుమళ్లు నీట మునిగాయి. మరో రెండుమూడు రోజులు వరద ఉంటే నారుమళ్లు పాడైపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముమ్మరంగా సహాయక చర్యలు

- జాంబవానిపేట, పొగాకులంక, పల్లెగూడేల్లో ముంపు ప్రాంతాల్లో ఉన్న 700 మందికి ప్రత్యేక పడవలలో వెళ్లి ఆహార పొట్లాలను ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, తహసీల్దారు ర్యూన్సీ లక్ష్మీకుమారి, ఎంపీడీఓ రాంబాబు, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు తదితరులు అందజేశారు.
- ఎదుర్లంకలో 26 మందికి రామాలయం పేటలో అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలోని పునరావాసం ఏర్పాటుచేసి తాగునీరు, ఆహార పొట్లాలు అందజేశారు. కేశనకుర్రులో డిజాస్టర్ టీం వచ్చి ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలిరావాలని కోరారు.



అల్లవరం మండలం మత్స్యకార కాలనీలో వరద నీరు

- పాతయింజరంలో ఉన్న అవుట్ ఫాల్ స్లూయిజ్ లీకవడంతో ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు హెడ్‌వర్క్ ఏఈఈ సుబ్రహమణ్యం సిబ్బందితో కలిసి యుద్ధ ప్రాతిపదికన లీకేజీని అరికట్టారు.
- అల్లవరం మండలంలోని మత్స్యకార కాలనీలో వరద పరిస్థితిని ఆర్‌డీఓ వసంతరాయుడు ఆదివారం పరిశీలించారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పడవపై వెళ్లి తాగునీరు, భోజనాలు అందించారు.
- జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలను అందిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణారెడ్డి బోడసకుర్రులోని వరద ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలించి కుటుంబానికి 20 లీటర్ల మంచినీటిని అందించే ఏర్పాటుచేశారు.
- అల్లవరం తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఎంపీడీఓ కృష్ణమోహన్, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేత పరమేష్, కార్యదర్శి దుర్గా శ్రీనివాస్ వరద పరిస్థితులపై అధికారులను అప్రమత్తం చేస్తూ నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

ముంపు ప్రాంతాల్లో ఆర్డీఓ పర్యటన

కాట్రేనికోన: మండల పరిధిలో నడవపల్లి, పల్లంకుర్రు రేవు, బూలవారి గట్టు తదితర గోదావరి ముంపు ప్రాంతాల్లో అమలాపురం ఆర్డీఓ వసంత రాయుడు పర్యటించారు. నడవపల్లి, పలంకుర్రు రేవులలో వైద్య శిబిరాలను, వరద బాధితులకు అందిస్తున్న భోజనం, వసతులపై ఆరా తీశారు. బలహీనంగా ఉన్న బూలవారిగట్టును పరిశీలించి ఇసుక బస్తాలు వేయాలని ఇరిగేషన్ ఏఈ శివరామకృష్ణను ఆదేశించారు. పలంకుర్రు రేవులో 78 కుటుంబాలు, పల్లిపాలెంలో 235 కుటుంబాలు వరద నీటి తాకిడికి గురైనట్లు తహసీల్దార్ సత్యనారాయణ వివరించారు. వరద ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ ఎస్.వెంకటాచలం, పల్లంకుర్రు సర్పంచ్ నాతి అలివేణి, నాతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బూలవారిగట్టు వద్ద అధికారులతో చర్చిస్తున్న ఆర్డీఓ వసంత రాయుడు

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆర్ఏఓ పర్యటన



దరియాలతిప్పలో ముంపునకు గురైన ఇళ్లను పరిశీలిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: స్థానిక నియోజకవర్గ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆదివారం ఆర్ఏఓ మునిస్వామి విస్తృతంగా పర్యటించారు. రాజీవ్‌బీచ్ వద్ద కోనవెంకటరత్నం నగర్‌తో పాటు పుష్కర ఘాట్ వెనుక ఉన్న ప్రాంతాల్లోనూ వరదనీరు రాకుండా ఇసుక బస్తాలను అడ్డుగా వేయించారు. ఆదివారం ఉదయం రాజీవ్‌బీచ్ రహదారి పైభాగానికి వరదనీరు చేరడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అనంతరం దరియాలతిప్ప గ్రామంలో బస్టాప్ వెనుక గోదావరి నది గట్టుపక్కన ఉన్న గృహాల వద్దకు వరద నీరు చేరడంతో అక్కడ కలియ తిరిగి బాధితులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పీడబ్ల్యూడీ ఈఈ వీరసెల్వం, ఏఈ నాగరాజు, ఎస్ఐ శేరు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



గురజాపులంకను చుట్టుముట్టిన వరద నీరు

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలంలోని లంకాఫ్‌ఠానేల్లంక, గురజాపులంక, కూనాలంక, చింతపల్లి లంక, చింతావాని రేవు సలాదివారిపాలెం, కమిని గ్రామాల ప్రజలు వరద నీటిలో కొట్టుమిట్టాడుతున్నారు. నివాస గృహాలు నీట మునిగాయి. లంక గ్రామాల్లో వందలాది ఎకరాల్లో అరటి, కొబ్బరి, కాయగూర తోటలు ముంపు బారిన పడ్డాయి. సలాది వారిపాలెం, శేరుల్లంక, కమిని గ్రామాల్లో వరద ప్రవాహానికి పంట భూములు, కొబ్బరి తోటలు కోతకు గురవుతున్నాయి. తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.

వరద నీటిని ఆపిన అవుట్‌ఫాల్ స్లూయిజ్

- ఎమ్మెల్యే అశోక్ చొరవపై ప్రజల ప్రశంసలు



ఓల్డ్ రాజీవ్ నగర్ వద్ద ఏర్పాటు చేసిన అవుట్‌ఫాల్ స్లూయిజ్

యానాం: గౌతమీ గోదావరికి వరదలొస్తే యానాం నియోజకవర్గ పరిధిలోని తీర, లోతట్టు గ్రామాలు ముంపునకు గురయ్యేవి. ఈ నేపథ్యంలో గతంలో వరద వచ్చిందంటే చాలు ఓల్డ్‌రాజీవ్‌నగర్, ఫ్రాన్స్ తిప్ప, బాలయోగి కోలనీ, కోన వెంకటరత్నం నగర్ తదితర ప్రాంతాలను ముంచెత్తేది. దీంతో సుమారు వారం రోజుల నుంచి పది రోజుల పాటు బాధితులంతా పట్టణంలో ప్రభుత్వం ఏర్పాటుచేసే పునరావాస శిబిరాల్లో తలదాచుకునేవారు. అయితే ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చొరవ తీసుకుని ఏటా వరద వస్తున్న ప్రాంతాలను గుర్తించి ఓల్డ్‌రాజీవ్‌నగర్ గట్టు ప్రాంతంలో కోరంగి నది ముఖద్వారం వద్ద ఎడమవైపున లక్షలాది రూపాయల ఖర్చుతో అవుట్‌ఫాల్ స్లూయిజ్ నిర్మింపజేసి దానికి భారీ లాకుగేట్లను సైతం ఏర్పాటుచేశారు. దీంతో ప్రస్తుత వరదలకు అవుట్‌ఫాల్ స్లూయిజ్ ఎంతగానో రక్షణగా నిలిచింది. దీంతో చుక్కనీరు లోతట్టు ప్రాంతాల్లోకి ఆదివారం వరకూ రాలేదు. వరద రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే అశోక్‌ను స్థానికులు ప్రశంసిస్తున్నారు.

మంత్రి విశ్వరూప్ దంపతులకు సత్కారం



మంత్రి విశ్వరూప్ దంపతులను సత్కరిస్తున్న దోలామణి దంపతులు

అమలాపురం రూరల్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, బేబీ మీనాక్షి దంపతులను అమలాపురం ఏఎంసీ తొలి మహిళా చైర్‌పర్సన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన దంగేటి దోలామణి దంపతులు ఆదివారం సత్కరించారు. భట్నవిల్లిలోని మంత్రి స్వగృహంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దంగేటి బుల్లబ్బులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెంచర్లలో 5 శాతం అదనపు సామాజిక స్థలం కేటాయింపును తొలగించి రియల్ ఎస్టేట్ రంగానికి మేలు చేశారంటూ అమలాపురం రియల్‌ఎస్టేట్ అండ్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. మచిలీపట్టణంలో జరుగుతున్న కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్‌ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) రాష్ట్ర స్థాయి సమావేశంలో అమలాపురం అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం పాల్గొని కోనసీమ జిల్లా క్రెడాయ్ చాప్టర్‌ను త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అమలాపురం అసోసియేషన్ అధ్యక్షుడు ఎమ్మెన్వీ ప్రసాద్, కార్యదర్శి కొత్తూరి శ్రీనివాసరావు, ప్రతినిధులు అరిగెల బుజ్జి, మారెళ్ల చినబాబు, ఎస్ఎంకే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రెడాయ్ సమావేశంలో పాల్గొన్న అమలాపురం రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ప్రతినిధులు

కుమారుడి మరణంతో విషాదం



మృతి చెందిన శివ(ఫైల్)

అమలాపురం టౌన్: యానాం-ఎదుర్లంక వారధిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరిలో అమలాపురం కల్వకొలనువీధికి చెందిన రాయపురెడ్డి శివ(32) ఉండడంతో స్థానికంగా విషాదం అలముకుంది. అమలాపురం నల్ల వంతెన వద్ద తన తండ్రి దొరబాబు నిర్వహిస్తున్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో శివ చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. అందివచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో అతడి కుటుంబీకులు కన్నీరు మున్నీరవుతున్నారు. శనివారం రావులపాలెం పని మీద మోటారు సైకిల్‌పై వెళ్లిన శివ కాజులూరు మండలంలో తన సోదరి మహేశ్వరిని చూసొద్దామని ఆమె ఇంటికి వెళ్లాడు. అమలాపురం వచ్చే సమయంలో యానాం-ఎదుర్లంక వద్ద రోడ్డు ప్రమాదానికి గురై చనిపోయాడని శివ తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. శివకు ఇంకా వివాహం కాలేదు.

చిల్డ్రన్ పార్కును సుందరంగా తీర్చిదిద్దండి

- ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: స్థానిక కుడుపూడి ప్రభాకరరావు మున్సిపల్ చిల్డ్రన్ పార్కును సుందరంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆదివారం ఆయన పార్కును సందర్శించారు. పార్కులో పెరిగిపోయిన పిచ్చి మొక్కలు, విరిగిపోయిన ఆట వస్తువులు, బొమ్మలను పరిశీలించారు. పార్కుకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించి అన్ని వసతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడికి సూచించారు. పార్కు చెంతనే ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. అనంతరం పార్కు పక్కనే ఉన్న మున్సిపల్ గ్రంథాలయ భవనాన్ని కూడా ఎమ్మెల్సీ పరిశీలించారు. ఆ భవనాన్ని కూల్చకుండా మరమ్మతులు చేయించి గ్రంథాలయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్సీతో పాటు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, కౌన్సిలర్ దొమ్మేటి రాము, పార్టీ నాయకులు కుడుపూడి త్రినాథ్, పితాని శ్రీను, యనమదల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



చిల్డ్రన్ పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, కమిషనర్ నాయుడు

రవిప్రకాష్‌కు పరామర్శ

రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ కుమారుడు రవిప్రకాష్‌ను ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, పార్టీ నాయకులు పరామర్శించారు. బోసు కుమారుడు ఇటీవల గుండెకు చికిత్స చేయించుకున్న సందర్భంగా ఎమ్మెల్సీ రామచంద్రపురం వెళ్లి ఆయనను పరామర్శించారు.

అర్హులందరికీ ఓఎన్‌జీసీ పరిహారం ఇవ్వాలి



ఆర్ఏఓ మునిస్వామికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

యానాం: స్థానిక నియోజకవర్గ పరిధిలోని ఓఎన్‌జీసీ సంస్థ మంజూరుచేసిన మత్స్యకారుల వేట నష్ట పరిహారాన్ని అర్హులందరికీ అందించాలని కోరుతూ బీజేపీ నియోజకవర్గ అధ్యక్షుడు కనకాల రాజు, మహిళా మోర్చ అధ్యక్షురాలు లక్ష్మీబాయ్‌లు ఆదివారం ఆర్ఏఓ మునిస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. లబ్ధిదారుల జాబితాలో అర్హులందరి పేర్లు చేర్చి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి దుగ్గదుర్తి అనిత, కె.వెంకటలక్ష్మి, విత్తనాల మహాలక్ష్మి, జ్యోతి, కొమ్ము కుమారి, వెంకటేశ్వరి, సురేష్ పాల్గొన్నారు.

ఎల్‌డీసీ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్‌లల్లో ఆగస్టు 27న ఎల్‌డీసీ పోస్టుల కోసం రాత పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ అధికారులు ఆదివారం తెలిపారు. మొత్తం 165 ఎల్‌డీసీ, 55 స్టోర్‌కీపర్ గ్రేడ్-3 పోస్టులకు 47 వేల మంది దరఖాస్తు చేశారన్నారు. రెండు గంటల పాటు నిర్వహించే ఎల్‌డీసీ పరీక్ష 100 మార్కులకు ఉంటుందని, తప్పు సమాధానానికి 0.25 మైనస్ మార్కులు ఉంటాయన్నారు. త్వరలోనే అభ్యర్థులకు పరీక్ష కేంద్రం, హాల్‌టికెట్ డౌన్‌లోడ్ గురించి తెలియజేస్తామన్నారు. ప్రశ్నలన్నీ ఇంటర్మీడియట్ స్థాయిలోనే ఉంటాయన్నారు. పరీక్ష పత్రం ఇంగ్లిష్‌తో పాటు తమిళం, తెలుగు, మళయాళంలో ఉంటుందన్నారు.

రూ.10 వేల విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి అన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన పోలంరాజు అమరేశ్వరరావు-మాధవి దంపతులు రూ.10,116 విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. దాతకు స్వామి చిత్రపటం, ప్రసాదాలను ఈఓ చేతుల మీదుగా అందజేశారు.

బాధితులకు భోజనం ప్యాకెట్ల అందజేత

ముమ్మిడివరం: మండలంలో ముంపుబారిన పడిన కర్రివానిరేవు శివారు చింతావానిరేవులో ఎంపీపీ కోలా గంగా భవాని, గ్రామ సర్పంచ్ కాశి భాగ్యలక్ష్మి, కోలా బాబ్జి, చింతా నాగ మునీంద్రరావు, కాశి జగపతిరావులు పర్యటించి బాధిత కుటుంబాలకు భోజనం ప్యాకెట్లు, మంచినీరు అందజేశారు. కార్యక్రమంలో పాము చిట్టిబాబు, గిరిగి కోదండ పాణి, వీఆర్‌ఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలకు భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న నాయకులు

మణిపూర్ దాడులకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



అమలాపురంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

అమలాపురం టౌన్: మణిపూర్‌లో జరుగుతున్న దాడులను నిరసిస్తూ అమలాపురం బైబిల్ మిషన్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ఆదివారం రాత్రి పుర వీధుల్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. 'సేవ్ మణిపూర్... సేవ్ ఇండియా' అంటూ నినాదాలు చేశారు. ర్యాలీ మార్కెట్ రోడ్డు నుంచి మెయిన్ రోడ్డు, గడియారం స్తంభం సెంటరు, హైస్కూలు సెంటరు వరకూ సాగింది. బైబిల్ మిషన్ ప్రతినిధులతో పాటు వందలాది మంది క్రైస్తవులు ర్యాలీలో పాల్గొన్నారు.

మహిళకు తీవ్ర గాయాలు

కొత్తపేట: మండలంలోని ఏనుగులమహల్ గ్రామానికి చెందిన ఒక మహిళ తన మనుమరాలు మొదటి పుట్టినరోజు సందర్భంగా రాత్రి వెలిగిద్దామని ఇంట్లో నిలువ ఉన్న దీపావళి చిచ్చుబుడ్లను ఎండలో ఎండబెట్టింది. అవి ఎలా వెలుగుతున్నాయో పరీక్షిద్దామని వెలిగించగా అది ఒక్కసారిగా చీదేసి ఆమె చీర అంటుకుంది. దాంతో ఆ మంటలకు మహిళ కాళ్లు, చేతులు, నడుము భాగాలు అంటుకుని తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను రావులపాలెంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి స్టేట్‌మెంట్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై శశాంక తెలిపారు.

కళ్ల కలకలం

పట్టణంలో పెరుగుతున్న బాధితులు

అమలాపురం టౌన్: కంట్లో నలుసు పడితే విలవిల్లాడిపోతాం. అలాంటిది కంట్లో కారం పడినట్లుగా ఏకదాటిగా మంట, నొప్పితో బాధపెట్టే కళ్ల కలక విజృంభిస్తుంది. ప్రస్తుతం పట్టణంలోని అనేక ప్రాంతాల్లో కళ్ల కలక విస్తృతంగా వ్యాపిస్తుంది. ప్రధానంగా పాఠశాలల్లో చిన్నారులకు సైతం కళ్ల కలక వస్తుండడంతో తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఉపశమనం కోసం కంటి వైద్య నిపుణుల సిఫార్సులతో కంటి డ్రాప్స్ వాడుతున్నారు. గతంలో ఏదో కంటికి వచ్చి తర్వాత వైరస్ తీవ్రతను బట్టి రెండో కంటికి సోకేది. ఇప్పుడు రెండు కళ్లకు ఒకేసారి కళ్ల కలక వస్తోంది. సాధారణంగా కళ్ల కలక రెండు నుంచి నాలుగు రోజుల్లో తగ్గిపోతుందని, కాని ఎవరికైనా నల్లగుడ్డుపై మచ్చలు ఏర్పడితే మాత్రం తక్షణమే అప్రమత్తం కావాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.




కళ్ల కలక సోకిన కన్ను

ఇవీ లక్షణాలు

కళ్లు నొప్పిగా కాస్త ఉబ్బినట్లుగా మారతాయి. అదే పనిగా కళ్ల నుంచి నీరు కారుతుంది. కళ్లలో ఏదో నలక పడినట్లుగా బాధపడుతుంటారు. వెలుతురు చూసేందుకు ఇబ్బంది పడతారు. కళ్లను తరుచూ తుడుచుకుంటూ కాస్త నలిపి ఉపశమనం పొందాలన్న భావన కలుగుతుంది. నివారణకు వైద్యులు సూచించిన లూబ్రికేటింగ్ డ్రాప్స్ గంట గంటకూ కళ్లలో వేసుకోవాలి. యాంటీ వైరల్ ఆయింట్‌మెంట్ రోజుకు ఐదుసార్లు కళ్లకు రాసుకోవాలి. కళ్ల నొప్పి ఎక్కువగా ఉంటే పేరాసిట్‌మాల్ టాబ్లెట్స్ ఉదయం, సాయంత్రం వాడాలి. వైరస్ ఎదుటి వ్యక్తి కళ్లకు వేగంగా సోకకుండా బాధితుడు కళ్లకు అద్దాలను ధరించాలి.

తీవ్రతను బట్టి వైద్యులను సంప్రదించాలి



కళ్ల కలక వచ్చిన వారు వైద్యులు సూచించిన డ్రాప్స్, ఆయింట్‌మెంట్, టాబ్లెట్స్ క్రమం తప్పకుండా వాడాలి. కళ్ల కలక సోకితే రెండు లేదా నాలుగు రోజుల్లో ఈ వైరస్ పూర్తిగా తగ్గిపోయే అవకాశం ఉంటుంది. అయితే నల్లగుడ్డుపై మచ్చలు ఏర్పడితే మాత్రం తక్షణమే అప్రమత్తం కావాలి. ఓ కన్ను మూసి ఓ కన్ను తెరిచి కంటి చూపును చెక్ చేసుకోవాలి. నల్లమచ్చ వచ్చినా, కంటి చూపు మబ్బుగా ఉన్నా తక్షణమే కంటి వైద్యుడిని సంప్రదించి తగిన అత్యవసర చికిత్స తీసుకోవాలి.

– డాక్టర్ కదలి ప్రసాద్, కంటి వైద్య నిపుణులు, అమలాపురం